సాక్షి నిజామాబాద్

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



ప్రశాంతంగా పండుగలు

ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని కలెక్టర్, సీపీ మత పెద్దలకు సూచించారు.

- 8లో ▸



యోగాలో జిల్లాకు పతకాలు

హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. జిల్లాకు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కింది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.3 /22.6

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎంపీ అర్వింద్‌కు పోలీసుల నోటీసులు

ఖలీల్‌వాడి: ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు నిజామాబాద్ 4వ టౌన్ పోలీసులు మంగళవారం నోటీసులు అందజేశారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నమోదైన కేసుకు సంబంధించి పోలీసులు ఈ నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసుతో పాటు మూడవ టౌన్‌కు సంబంధించిన రెండు నోటీసులు పోలీసులు ఇచ్చేందుకు ప్రయత్నించగా సంబంధిత పోలీసులు వచ్చి ఇవ్వాలని ఎంపీ హెచ్చరించినట్లు సమాచారం. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్‌లో జరుగుతున్న పదాధికారుల సమావేశానికి పోలీసులు నోటీసులు తీసుకురావడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆర్మూర్‌లో తనకు ఇల్లు ఉందని ఉదయం నుంచి అక్కడే ఉన్నానని నోటీసులు ఎందుకు తీసుకురాలేదని పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం 4వ టౌన్ పోలీసులు ఇచ్చిన నోటీసులపై సంతకాలు చేసి ఎంపీ తీసుకున్నారు. సోషల్ మీడియాలో బీజేపీకి చెందిన వారు పోస్టులు పెడితే కేసులు పెడుతున్నారని అధికార పార్టీ ఎన్ని పోస్టులు పెట్టినా కేసులు ఎందుకు పెట్టడం లేదని పోలీసులను ఎంపీ నిలదీసినట్లు తెలిసింది.

ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు నిలిపివేత

- ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఉపాధ్యాయుల వాగ్వాదం

నిజామాబాద్‌అర్బన్: ఉపాధ్యాయులకు జారీ చేయాల్సిన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు నిలిపివేశారు. విద్యాశాఖలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో కొందరు ఉపాధ్యాయులు నకిలీ ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించారు. ఈ అంశంపై 'సాక్షి' లో కథనం ప్రచురితం కాగా, ఆస్పత్రి వైద్యాధికారులు 105 మంది ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను ఆపేశారు. ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు జారీ చేసిన ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు పూర్తి పరిశీలన చేసిన తర్వాతే ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని స్పష్టం చేశారు. దీంతో ఉపాధ్యాయులు మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌తో వాగ్వాదానికి దిగారు.

చేపపిల్లల పంపిణీకి ప్రణాళిక

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో చేప పిల్లల పంపిణీని వేగవంతం చేసేందుకు మత్స్యశాఖ చర్యలు చేపట్టింది. ఏడీ రాజనర్సయ్య తిరిగి జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టడంతోపాటు సమ్మెలో ఉన్న సిబ్బంది విధుల్లో చేరారు. డిచ్‌పల్లి, ధర్పల్లి మండలాల్లోని 55 చెరువుల్లో 20లక్షల చేప పిల్లల ను బుధవారం విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది జిల్లాలోని 1,018 చెరువుల్లో 4.71 కోట్ల చేప పిల్లల విడుదల లక్ష్యంకాగా, టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఇప్పటి వరకు 26 చెరువుల్లో 12లక్షల వరకు చేపపిల్లలను వదిలారు. నెలరోజుల్లో జిల్లా వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీని పూర్తి చేస్తామని మత్స్యశాఖ ఏడీ రాజనర్సయ్య 'సాక్షి'కి తెలిపారు.

ప్రధాన మంత్రి మోదీ సభకు

లక్ష జనసమీకరణ



ప్రధాని మోదీ బహిరంగసభ నిర్వహించే గిరిరాజ్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడి
- నగరంలో జరిగిన నిజామాబాద్ ఉమ్మడి జిల్లా, నిర్మల్, జగిత్యాల జిల్లాల పదాధికారుల సమావేశానికి హాజరు

సుభాష్‌నగర్: అక్టోబర్ 3న జిల్లా కేంద్రంలో జరిగే ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేసేలా ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని బస్వాగార్డెన్‌లో ఉమ్మడి నిజామాబాద్, జగిత్యాల్, నిర్మల్ జిల్లాల పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. సభకు జన సమీకరణ, వివిధ అంశాలపై రాష్ట్ర, జిల్లాల నాయకులతో సమీక్షించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 3న నగరంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సభ నుంచి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారని పేర్కొన్నారు. సభకు జిల్లాల నుంచి లక్ష మందికిపైగా ప్రజలను సమీకరించాలని సూచించారు. అధికారిక కార్యక్రమం అయినప్పటికీ బహిరంగ సభతో ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభకు శ్రీకారం చుడతారని తెలిపారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బీజేపీ కీలకపాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలో అన్ని స్థానాల్లో కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, దక్షిణ తెలంగాణలోనూ పార్టీ బలపడుతోందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్ ధర్మపురి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, అరుణ తార, ఆయా నియోజకవర్గ నాయకులు ధన్‌పాల్ సూర్యనారాయణ, దినేష్ కులాచారి, మల్లికార్జున్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకట్, సత్యనారాయణ, కార్పొరేటర్లు, నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్‌లో గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌ను వీక్షిస్తున్న కిషన్‌రెడ్డి, నాయకులు

పర్యాటక ప్రాంతమయ్యేనా?



ఎస్సారెస్పీ పరిసరాల్లో పర్యాటకులు(ఫైల్)

- ఆకట్టుకుంటున్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పరిసరాలు
- మెరుగులు దిద్దితే మరింత ఆకర్షణీయం
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



బాల్కొండ: ప్రకృతి అందాలతో అలరారుతున్న ఉత్తరతెలంగాణ కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పర్యాటకంగా ఎంతో అనుకూలమైన ప్రాంతం. ప్రకృతి అందాలకు కాస్త మెరుగులు దిద్దితే ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఎస్సారెస్పీ పరిసర ప్రాంతాలతోపాటు వరదనీటిని దిగువకు వదిలేందుకు ఏర్పాటు చేసిన 42గేట్లు ప్రధాన ఆకర్షణ. ప్రాజెక్ట్‌పై నుంచి దిగువ భాగాన చూస్తే ఓవైపు గలగలపారే గోదావరి, మరో వైపు పచ్చని చెట్లు, కాలువ, మధ్యలో రోడ్డు కనువిందు చేస్తాయి. గతంలో పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వాలు వెనుకడుగు వేసాయి. 2009లో అప్పటి ప్రభుత్వం పార్కు ఏర్పాటుకు రూ.6 కోట్లు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. ఇప్పటికైన ఎస్సారెస్పీ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని పర్యాటకులు ఆశాభావం వ్య క్తం చేస్తున్నారు. ఆరు జిల్లాలకు నీరందించడంతోపాటు ప్రకృతి అందాలతో ఆకట్టుకుంటున్న ఎస్సారెస్పీని ప్రపంచానికి చూపాల్సిన బాధ్యత పాలకులపై ఉందంటున్నారు.

ఎస్సారెస్పీ టు బాసర..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి బాసర వరకు బోటు సౌకర్యం కల్పిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఎస్సారెస్పీ పర్యాటకంగా అభివృద్ధి చెందితేనే ఇది సాధ్యమయ్యేలా కనిపిస్తున్నది. ఎస్సారెస్పీ నుంచి బాసరకు బోటు సౌకర్యం కల్పిస్తే ఎందరో పర్యాటకులు ఎస్సారెస్పీ అందాలను ఆస్వాదించడంతోపాటు బాసరలోని చదువుల తల్లిని దర్శించుకునే అవకాశం ఉంటుందని పర్యాటకులు అంటున్నారు. పాలకులు స్పందించి వెంటనే ఎస్సారెస్పీని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

కొందరికే రుణమాఫీ



- మూడొంతుల మందికి పైగా రైతులకు అందని రుణమాఫీ
- బ్యాంకు ఖాతాకు ఆధార్ నంబర్ లింక్ లేకపోవడమే కారణం
- రైతులకు సమాధానం చెప్పలేకపోతున్న అధికారులు
- ప్రభుత్వ ప్రకటనలకు విరుద్ధంగా వాస్తవ పరిస్థితులు

మోర్తాడ్(బాల్కొండ): పంట రుణమాఫీ ఫలాలు రైతులందరికీ అందలేదు. భారీ మొత్తంలో నిధులు మంజూరు చేశామంటున్న ప్రభుత్వ ప్రకటనకు వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. ఇప్పటి వరకు 75 శాతానికిపైగా రైతులకు రుణమాఫీ సొమ్ము జమ కాకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతున్నది. లక్ష్యానికి అనుగుణంగా నిధులు విడుదల కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులకు సమాధానం దొరకడం లేదు. వ్యవసాయశాఖ, బ్యాంకర్ల మధ్య సమన్వయం ఉంటే రుణమాఫీ అంశంపై స్పష్టత వచ్చేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆగస్టు 3న రుణమాఫీకి గ్రీన్ సిగ్నల్‌ఇచ్చిన ప్రభుత్వం.. దశలవారీగా ఈనెల 15వ తేదీ వరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ సొమ్మును రైతుల పంటరుణాల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించింది. అనేక మంది రైతుల ఆధార్ నంబర్లు బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయకపోవడం, తప్పుడు ఆధార్ వివరాలు తదితర కారణాలతో మాఫీ సొమ్ము వెనక్కి వెళ్లిపోయిందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు పంటరుణాల మాఫీకి సంబంధించి ఫిర్యాదులు కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోలేదు. రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే వారి వద్ద సరైన సమాచారం లేకపోవడంతో రైతులకు ఏమి చెప్పాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎప్పటిలోగా మాఫీ సొమ్ము తమ ఖాతాల్లో జమ చేస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో రుణమాఫీ వివరాలు..

అర్హులైన రైతులు	2,91,188
మాఫీసొమ్ము అందుకున్న రైతులు	67,553
మాఫీ సొమ్ము అందాల్సిన రైతులు	2,23,635
రుణమాఫీ లక్ష్యం	రూ.1790.00 కోట్లు
మాఫీ అయిన మొత్తం	రూ. 324.63 కోట్లు
మాఫీ కావాల్సిన మొత్తం	రూ.1,465.77 కోట్లు

ప్రభుత్వం మాటతప్పింది



పంట రుణాల మాఫీపై ప్రభుత్వం మాట తప్పింది. రైతులను నమ్మించి మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాల్సిందే. రైతులు వడ్డీ భారం మోస్తున్నా ప్రభుత్వానికి చలనం లేదు. రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధి లోపించడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

– సుంకెట్ అన్వేష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు

- నగరంలో 28న గణేశ్ శోభాయాత్ర
- ఉమ్మెడ, బాసరలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ
- 8ఫీట్లు దాటిన విగ్రహాల రూట్ మళ్లింపు



బాసర బ్రిడ్జిపై మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి/బోధన్ : ఈనెల 28 న నిర్వహించనున్న గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లో హైటెన్షన్ రైల్వేలైన్ ఉన్నందున 8 ఫీట్లకంటే ఎక్కువ ఎత్తున్న విగ్రహాలు బాసరవైపు వెళ్లే వీలుండదన్నారు. 8ఫీట్ల లోపుఎత్తు ఉన్న విగ్రహాలను పాత రూట్ ప్రకారం నెహ్రూపార్కు, అర్సపల్లి, జాన్కంపేట్, నవీపేట్ మీదుగా బాసరకు తరలించాలని సూచించారు. 8ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తుఉన్న విగ్రహాల శోభాయాత్ర రూట్‌ను మార్చినట్లు తెలిపారు. పూలాంగ్–ఎన్టీఆర్ చౌరస్తా రైల్వే స్టేషన్ –బస్‌స్టేషన్–రైల్వే ఓవర్ బ్రిడ్జి–శివాజీచౌక్–దుబ్బ– జీజీ కాలేజీ చౌరస్తా–బైపాస్‌రోడ్డు తెలంగాణచౌక్ ముబారక్‌నగర్–మానిక్‌బండార్–దాస్‌నగర్–మాక్లూర్–నందిపేట్–నవీపేట్ మీదుగా బాసరకు వెళ్లాలని సూచించారు.

శోభాయాత్ర మార్గం పరిశీలన..

ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని నిర్వహించుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలిసి కలెక్టర్ శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఉమ్మెడ, బాసర బ్రిడ్జిల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయడంతోపాటు క్రేన్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. సీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నామన్నారు. సుమారు 3 వేల వరకు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి బాసరకు తరలించే అవకాశం ఉందని తెలిపారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నివాళులర్పిస్తున్న కలెక్టర్, జడ్పీ చైర్మన్ తదితరులు

నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ సాయుధపోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించారు. వినాయక్‌నగర్‌లోని ఐలమ్మ విగ్రహానికి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కలెక్టర్, అధికారులు, కులసంఘాల ప్రతినిధులు మంగళవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారన్నారు. హక్కులకోసం రాజీలేని పోరాటం చేసి స్ఫూర్తిదాతగా నిలిచార న్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివద్ధి అధికారి రమేశ్, నర్సయ్య, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి వరద నీరు ..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 21,118 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలు ద్వారా 300 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 12 వేల క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(90 టీఎంసీలు) అడుగుల కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్ అంతేస్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండు కుండలా ఉంది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్ల ద్వారా 36.27 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

క్లుప్తంగా

అధికారుల సూచనలు పాటించాలి



బాల్కొండ: రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన మక్క, సోయా, పసుపు, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నంబరు ప్రకారం నమోదు చేసినట్లు తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచించే యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి, ఏఈవో నిహారిక, రైతులు ఉన్నారు.

ఔట్‌సోర్సింగ్ సిబ్బంది బైక్ ర్యాలీ



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన మంగళవారం 9వ రోజుకు చేరింది. తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్‌తో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది క్యాంపస్‌లో బైక్‌ర్యాలీతో నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బికోజీ, రవీందర్ నాయక్, శ్రీధర్, గులాబ్, నరేశ్, బబ్లూ, తిరుపతి, దిగంబర్, సురేశ్, సుధీర్, క్రాంతి, సుభాన్‌రావు, తెయూ, సౌత్ క్యాంపస్, సారంగపూర్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో అంగన్‌వాడీల పాత్ర కీలకం



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. అర్థశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ డాక్టరేట్ పూర్తి చేసిన డాక్టర్ దేవీదాస్ సక్వాల్ రచించిన 'తెలంగాణ రాష్ట్రం- సంక్షేమ పథకాల అమలులో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర' అనే పుస్తకాన్ని రిజిస్ట్రార్ తన ఛాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. శాస్త్రీయ ఆధారాలతో గణాంకాలను ఉపయోగించి రచించిన ఈ పుస్తకం అంగన్‌వాడీ టీచర్ల విధులు, సమస్యలను సమగ్రంగా తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నసీమ్, ప్రొఫెసర్ త్రివేణి, అధ్యాపకులు పాత నాగరాజు, ప్రవీణ్ మామిడాల, శ్రీనివాస్, ఎ.నాగరాజు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..





పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సప్ చేయగలరు.

పంపించాల్సిన వాట్సప్ నెం. 8978036828



సువర్ణ, కొత్తపల్లి



నవీన్, దోభీగల్లీ, నిజామాబాద్



మణితేజ, సాయితేజ (గౌతమ్‌నగర్)



ఓం గణేశ్ మండలి, ముబారక్‌నగర్



బాల అంబేద్కర్ గణేశ్ మండలి, ముప్కాల్



నక్షయ్, మోస్రా



ముత్యాలమ్మ గణేశ్ మండలి, రెంజల్



ఈశ్వర్, కమలాపూర్



వీక్షిత, నందిపేట



నాగభూషణం, సాలంపాడ్



విక్రంరెడ్డి, మల్లారం



శివ, భీమ్‌గల్



రసజ్ఞ, సిర్‌పూర్



అన్వేష్, గౌతమి (కమ్మర్‌పల్లి)



వైశ్యభవన్ గణేశ్ మండలి, నిజామాబాద్



రెడ్ బ్లూ యూత్ గణేశ్ మండలి, కొనసముందర్



ఓం శ్రీమాన యూత్ గణేశ్ మండలి, గౌతంనగర్



గాయత్రినగర్ గణేశ్ మండలిలో..



లోకేశ్, శ్రీరామ్, సురేశ్, ప్రవీణ్ (గాజులపేట)

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ ఇరు మతాల పెద్దలకు సూచించారు. ఈనెల 28న వినాయక నిమజ్జన శోభాయాత్ర, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఒకే రోజు నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వేడుకల నిర్వహణ తీరుతెన్నుల గురించి ఇరు మతాల పెద్దలు, కమిటీ సభ్యులతో చర్చించారు. గణేశ్ నిమజ్జనానికి గతేడాది ఖరారు చేసిన రూట్ మ్యాప్ ప్రకారంగా ఈసారి అదే మార్గాల మీదుగా శోభాయాత్ర కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. మిలాద్-ఉన్-నబీ, వినాయక శోభాయాత్ర సందర్భంగా ప్రతి చోట కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మకరంద్, అదనపు డీసీపీ జయరాం, ఆర్డీవో రాజేంద్రకుమార్, సార్వజనిక్ గణేశ్ మండలి ప్రతినిధులు బంటు గణేష్, శివకుమార్ పవార్, వినోద్ కుమార్ గుప్తా, డిప్యూటీ మేయర్ ఇద్రీస్ ఖాన్, ఎంఐఎం ప్రతినిధులు షకీల్, శహబాజ్, మత పెద్దలు రఫత్ ఖాన్, కరీముద్దీన్ కమాల్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్రను ఆద్యంతం పర్యవేక్షించాలి

శాంతి కమిటీ సమావేశం అనంతరం కలెక్టర్, సీపీలు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. చెరువులు పూర్తిస్థాయిలో నిండి ఉన్నందున నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు.

కరుడుగట్టిన నేరస్తుడి అరెస్ట్

- దోపిడీ, హత్య నేరాల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న జుల్ఫీసింగ్
- ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: దోపిడీ, హత్య నేరాల్లో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తూ పెరోల్‌పై బయటకొచ్చి, జైలుకు వెళ్లకుండా తిరుగుతున్న ఓ కరుడుగట్టిన నేరస్తుడిని కామారెడ్డి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అతనితో పాటు బైక్ చోరీల కేసులో మరో నలుగురిని అరెస్ట్ చేసి మొత్తం 51 బైకులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. కామారెడ్డి పరిసర ప్రాంతాల్లో తరచూ బైక్ చోరీలు జరుగుతుండడంతో నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఉదయం కామారెడ్డిలోని హైదరాబాద్ రోడ్‌లో మూడు బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్ చోరీల ఉదంతం బయటపడింది. నిందితులను మహారాష్ట్రకు చెందిన జుల్ఫీసింగ్, కామారెడ్డికు చెందిన షేక్ యూనుస్, బాన్సువాడకు చెందిన షేక్ సోహెల్, హైదరాబాద్‌కు చెందిన సోహెల్ అలీ, బంజారాహిల్స్‌కు చెందిన చాపల అంజప్పగా గుర్తించారు. కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మెదక్‌లో, పలు ప్రాంతాల్లో మొత్తం 51 బైకులను నిందితులు చోరీ చేశారు. అనంతరం పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



జుల్ఫీసింగ్

రేపు వైన్ షాపులు బంద్

ఖలీల్‌వాడి: గణేశ్ నిమజ్జనం సందర్భంగా జిల్లాలోని వైన్స్‌లు, బార్‌లు ఈ నెల 28న ఉదయం 6 నుంచి 29న ఉదయం 10 గంటల వరకు మూసి ఉంటాయని సీపీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో వైన్స్ షాపులను తెరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.కోటిన్నరతో వ్యక్తి పరార్

నందిపేట: అమాయక ప్రజలను ఆసరా చేసుకొని ఓ వ్యక్తి రూ. కోటిన్నరతో పరారైన ఘటన మండలంలోని తల్వేదలో చోటు చేసుకుంది. కోటగిరి శివప్రసాద్ అనే వ్యక్తి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రుద్రంగి నుంచి వలస వచ్చి 18 సంవత్సరాల క్రితం మండలంలోని తల్వేదలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. నాటి నుంచి ఊరిలోనే మెడికల్‌షాప్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంచి వ్యక్తిగా పేరుపొందడంతో శివప్రసాద్ వద్ద గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చిట్టీలు వేశారు. నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టడంతో అప్పులు పెరిగాయి. దీంతో కుటుంబ సభ్యులను వదిలి రూ. కోటిన్నర నగదుతో పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొదుపు చేసేవారే టార్గెట్

మండల కేంద్రంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసుకునే వారిని ఆసరా చేసుకుని ఇలాంటి ఈ ఘటనలకు పాల్పడుతున్నారు. గతంలో దత్తాపూర్‌కు చెందిన ప్రభుత్వ టీచర్ సుమారు రూ. మూడు కోట్లతో, ఆరేళ్ల కిందట గంగాసముందర్‌లో రేషన్ డీలర్ రూ.2 కోట్లతో పరారయ్యాడు. ఇలా వరుస ఘటనలు జరగడంతో మండలంలోని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

వైద్యారోగ్యశాఖ ఏఓగా డాక్టర్ సరిత

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా అంజన

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిపాలన అధికారి(ఏఓ)గా డాక్టర్ సరిత బాధ్యతలు స్వీకరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ మెటర్నిటీ అండ్ హెల్త్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ అంజనా డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా వచ్చారు. అనంతరం ఉద్యోగులు, వైద్య సిబ్బంది డాక్టర్ సరితకు శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత

- అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

నిజామాబాద్‌నాగారం: దివ్యాంగుల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల చట్టంపై జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కమిటీ సభ్యులు పలు అంశాలను ప్రస్తావించగా, అదనపు కలెక్టర్ వాటిపై సానుకూలంగా స్పందించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యంగులకు కోసం నెలకొల్పిన సంరక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి రసూల్ బీ, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాలో జిల్లాకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాలు రావడంతో పాటు ఓవరల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాలబాలికలు, మహిళలు పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా యోగాసనా సాధకులు విశేష ప్రదర్శన ద్వారా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు.

పతకాలు సాధించింది వీరే..

తన్వీ, తనయ, సంజన, హాసిని, లక్ష్మశ్వ, రాకేశ్, మణివర్ధన్,జి.లక్ష్మీనారాయణ, ఓంసాయి, నిర్ణయ, హషిత, నవనీత్, భూమేశ్, రసజ్ఞ, డి. ప్రియాంక, ప్రియాంక,రవళి,ప్రశాంతిశ్రీ,అనిల్, రాజు, విలాస్, రాజు,ప్రియాంక,అను, పద్మ, జాన్సీ, సునీత, రమ.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఈవో

వేల్పూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని పడగల్ హైస్కూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ జిల్లాస్థాయి అండర్-14, 17 బాల బాలికల జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడాకారులు పోటాపోటీగా ఆడారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సంగీత్‌రావు, సర్పంచ్ వర్షిణి రాజ్‌కుమార్, హెచ్‌ఎం రామచందర్, ఎంపీటీసీలు శ్యాంరావు, ఆమోస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చివరి చూపు దక్కొద్దని..

- వృద్ధుడి ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న స్థానికులు

రెంజల్(బోధన్): కన్న వారికి కడసారి చూపు దక్కొద్దని గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని స్థానికులు కాపడగా పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. సిరిసిల్ల జిల్లా గంభీరావ్‌పేట్ మండలానికి చెందిన లచ్చిపేట మల్లయ్యకు నలుగురు కూతుళ్లు. వారి వివాహాలు చేసినా వృద్ధాప్యంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. వంతెన వద్ద అనుమానంగా తిరుగుతున్న 82 సంవత్సరాల మల్లయ్యను గుర్తించిన స్థానికులు పట్టుకుని వివరాలను తెలుసుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై ఉదయ్‌కుమార్ అక్కడికి చేరుకుని స్టేషన్‌కు తీసుకొచ్చారు. కుటుంబీకులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

బోలెరో వాహనం టైర్లు చోరీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ సమీపంలో రాత్రి పార్కింగ్ చేసిన బోలెరో గూడ్స్ వాహన టైర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. సోమవారం రాత్రి పార్కింగ్ చేయగా మంగళవారం ఉదయం చూడగా టైర్లు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ట్రాలీఆటో బోల్తా



ఇందల్వాయి: డిచ్‌పల్లి నుంచి మండలకేంద్రానికి వస్తున్న ట్రాలీ అదుపు తప్పి బోల్తాపడింది. డ్రైవర్‌నిద్రమత్తులో ఉండడంతో ఆటో సైన్‌బోర్డును ఢీకొని బోల్తాపడింది. ఘటనలో తిర్మన్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ శంకర్ స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

స్వగ్రామానికి మృతదేహం



కిరణ్ (ఫైల్)

మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన కిరణ్ (21) అనారోగ్యంతో బాధపడుతూ ఖత్తర్‌లో మృతి చెందగా, మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరింది. ఉపాధినిమిత్తం మూడునెలల క్రితం ఖత్తర్ వెళ్లిన కిరణ్, 20 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కిరణ్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు.

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి

నస్రుల్లాబాద్: మండల శివారులోని అటవీ ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడ లైన్‌ఇన్‌స్పెక్టర్ గజేందర్(45)మృతి చెందాడు. వర్ని నుంచి బాన్సువాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొనడంతో కిందపడిపోయాడు. అదే సమయంలో వచ్చిన లారీ గజేందర్‌పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్ మండల కేంద్రంలోని రాజనగర్ దుబ్బ ప్రాంతానికి చెందిన చిత్తరి లక్ష్మి(21) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన జమున తన డబ్బులు దొంగిలించిందనే భావనతో లక్ష్మితో గొడవ పడింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మి మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది. లక్ష్మి భర్త ప్రదీప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాగులో మృతదేహం లభ్యం



రాంచందర్ (ఫైల్)

మాక్లూర్: మండలంలోని చిక్లి శివారులోని చెక్‌డ్యామ్‌లో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. నవీపేటకు చెందిన ఈర్నాల రాంచందర్ (32) జన్నేపల్లి బ్రిడ్జి వద్ద ఈ నెల 21న చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. విషయం గుర్తించిన పలువురు కుటుంబ సభ్యులకు తెలుపగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి చిక్లి శివారులోని చెక్ డ్యామ్ వద్ద మృతదేహం లభ్యమైందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు ప్రమాదంలో ఆర్మీ జవాన్..



జైపాల్‌రెడ్డి (ఫైల్)

రాజంపేట: బస్వన్నపల్లి గ్రామానికి చెందిన ఈగ జైపాల్‌రెడ్డి(45) అనే ఆర్మీ జవాన్ సోమవారం రాత్రి ట్రైన్ ప్రమాదంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో రాజస్థాన్ అల్వార్ జంక్షన్ స్టేషన్ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు రైలు ఎక్కుతుండగా ప్రమాదశాత్తు కాలుజారి రైలు కిందపడి చనిపోయినట్లు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడు..

రెంజల్(బోధన్): నీలా గ్రామ పంచాయతీలో వాటర్‌మన్‌గా పనిచేస్తున్న కార్మికుడు గుట్క పోశెట్టి(48) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల కడుపునొప్పితో బాధపడుతున్న పోశెట్టి ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో ఈ నెల 21న ఇంట్లో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రిలో చూయించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంత్యక్రియల నిమిత్తం పంచాయతీ కార్యదర్శి మృతుడి భార్య సుజాతకు జీపీ నిధుల నుంచి రూ. 10 వేలు అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వదల్‌పర్తిలో వివాహిత..



సుశీల(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని వదల్‌పర్తి గ్రామానికి చెందిన చాకలి సుశీల(43) ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారంరాత్రి మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. సుశీల కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ నెల 22న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఎల్లారెడ్డిపేటలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో వీరయ్య తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



ప్రవీణ్ (ఫైల్)

మోపాల్: న్యాల్‌కల్ గ్రామంలో సున్నం ప్రవీణ్(30) విద్యుదాఘాతంతో మంగళవారం రాత్రి మృతిచెందాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. ప్రవీణ్ వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. నిమజ్జనం సందర్భంగా గణపతిని తరలించేందుకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశాడు. తన ఇంటి దాబాపై ఏర్పాటు చేసిన గణపతిని తీసుకొచ్చేందుకు వెళ్లిన ప్రవీణ్ విద్యుత్‌తీగలపై అడుగుపెట్టడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించి కూతురు తల్లికి సమాచారం అందించగా ప్రవీణ్ భార్యకు సైతం విద్యుదాఘాతం సంభవించి దూరం పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రవీణ్‌ను ఆసుపత్రి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కుంటలో పడి యువకుడు..



ఈస్సాబేగ్ (ఫైల్)

బోధన్ టౌన్ (బోధన్): రాకాసిపేట్‌లోని కర్దం కుంటలో ఈస్సాబేగ్ (22) అనే యువకుడు మృతి చెందినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి అన్న షేక్‌గౌస్‌బేగ్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు.